# నెలవంక

అదే నవ్వు - పూల జలపాతంలా స్నిగ్ధంగా.

అదేరూపం - పూల పల్లకిలా ముగ్ధంగా - రెప్ప వాల్చకుండా శివమాలనే తన ఇంటి కిటికీలో నుండి చూస్తూంది పూర్ణిమ.

పూర్ణిమ ఎదురింటిలో సంవత్సరం నుండి అద్దెకి వుంటోంది శివమాల. గ్రామీణ బ్యాంక్‌లో క్లర్క్‌గా పనిచేస్తోంది శివమాల. బ్యాంక్‌కి బయలుదేరుతూ ఇంటికి తాళం వేస్తుంటే "ఏంటీ ఉద్యోగానికి వెళుతున్నావా?" అని వినిపించింది. ఆమె వెనక్కి తిరగకుండానే ఆ స్వరాన్ని గుర్తించింది. ఆ స్వరంలో విస్మయాన్ని గమనించింది.

నాంచారి, ఇంటి యజమానురాలు.

శివమాల తాళం వేసి వెనక్కి తిరిగి 'ఈవేళ రాములింకా రాలేదు. ఏదైనా దూరపు బేరం వస్తే వెళ్లాడనుకుంటాను. నేవెళ్లాక వస్తే రేపు కాస్త త్వరగా రమ్మని చెప్పండి. వెళ్లొస్తానండి అమ్మమ్మ గారు" అంటూ ఆమె ఆశ్చర్యాన్ని ఏమాత్రం లక్ష్యపెట్టకుండా కాంపౌండ్ వాల్ గేట్ తీసుకొని వీధిలోకి వచ్చింది శివమాల.

అరవైఏళ్ల నాంచారికి లౌక్యం తెలియదు కాబట్టి నిర్మొహమాటంగా తన ఆశ్చర్యాన్ని ప్రకటించింది. ఎన్నో జతల కళ్లూ, మరెన్నో జతల అధరాలు ఆశ్చర్యాన్ని, అసహ్యాన్ని ఆక్షణంలో ప్రకటిస్తున్నాయని శివమాలకి తెలుసు. అయినా ఆమె ఎవర్నీ లక్ష్యపెట్టకుండా ఠీవిగా నడుస్తోంది ఎప్పటిలా ఆ వీధిలో.

'అదే నడక - అదే ఠీవి. ఇదెలా సాధ్యం?' అని ఆశ్చర్యపోయింది పూర్ణిమ.

శివమాల వుంటున్న ఇంటికి, బ్యాంక్ నడిచి వెళ్లేంత దూరంలో లేదు. ఉదయం పూట ఆమె రిక్షాలో వెళుతుంది. ప్రతిరోజూ ఆమెని తీసుకెళ్లే రిక్షాఅబ్బాయి పేరు రాములు.

శివమాల వీధి చివరికి వచ్చేసరికి నలుగురైదుగురు రిక్షావాళ్లు రిక్షాల్లో కూర్చుని సినిమాల గురించి తన్మయంగా మాట్లాడుకుంటున్నారు. వాళ్లలో రాములు వుండడం చూసి శివమాల "నువ్వింకా బేరంపై దూరం వెళ్లావనుకున్నాను. సినిమా కథ వింటూ కూర్చున్నావా? త్వరగా పద టైమ్ అయిపోతోంది" అంది హడావుడిగా.

శివమాలని చూస్తుంటే రాములికి నోట మాట రాలేదు.

"రాములికి కూడా తెల్సిందా? అవును ఇదేమంత పెద్ద వూరు? అందరూ అందరికి తెలిసేంత. ఈ వూరిలో నా విషయం తెలియని వారుంటే ఆశ్చర్యపోవాలి కాని, తెలిస్తే ఆశ్చర్యం ఏముంది?" అనుకుందామె.

"మా...ట...ల్లో... టైమ్ చూసు...కోలేదమ్మా" అక్షరాలు కూడబలుక్కుంటూ అన్నాడు రాములు.

ఆమె ఆ విషయం గమనించనట్టే "నడు త్వరగా, టైమ్ అయింది" అంది.

బ్యాంక్‌లో ప్యూన్ నుండి మేనేజర్ వరకు ఆమెని వింతగా పట్టి పట్టి చూసారు. గుసగుసలు పోయారు. ఆమె దగ్గరికి రాగానే గప్‌చిప్ అుపోయేవారు. ఆ మాటలు, నవ్వులు తన గురించేనని ఆమెకి తెలుసు. అయినా ఆమె చెరగని చిర్నవ్వుతో సాయంత్రం వరకు పనిచేసింది.

సాయంత్రం బ్యాంక్ నుండి ఇంటికి నడిచి రావటం ఆమెకి అలవాటు. ఎప్పటిలానే బ్యాంక్ టైమ్ అవగానే దారిపక్క గడ్డి పువ్వులని, విరిగిన మేఘాలని, ఎగిరే పాలపిట్టల్ని, పారే కాలువని చూస్తూ మెల్లగా నడుస్తోంది శివమాల.

'ఒక్కరోజు గడిచింది. ఇంకేం పర్లేదు. నే సాధించాను. నాక్కావాల్సిన ఆనందాన్ని పొందుతాను. నేను నా జీవితాన్ని నాకు కావల్సిన రీతిలో మల్చుకుంటాను. నే గెలిచాను' అనుకుందామె.

★ ★ ★

నెలరోజులు గడిచాయి.

"బ్యాంక్‌కి టైమ్ అయిందమ్మాయ్. త్వరగా తెములు" పూజమధ్యలో బయటికి వచ్చి మరీ టైమ్ చెబుతోంది నాంచారి.

కరెక్ట్ టైమ్‌కి రాములు వచ్చి "అమ్మగారూ" అంటూ గంట గణగణ లాడిస్తూ పిలుస్తున్నాడు.

పక్కింటి పరంధామయ్యా, ఎదురింటి ఏకదంతం, మధ్య ఇంటి మహలక్ష్మమ్మా బుగ్గలు నొక్కుకోవటం మానేసారు.

బ్యాంక్‌లో ప్యూన్ నుండి మేనేజర్ వరకు కళ్లలో కుతూహలం, పెదవులపై వంకర నవ్వు తగ్గించేశారు.

పూర్ణిమ మాత్రం విస్మయ సాగరంలో కొట్టుకుపోతూనే వుంది.

'ఇదెలాసాధ్యం?' – నిరంతరం ఆమెని వెంటాడుతూనే వుందా ప్రశ్న.

ఒకానొక సంధ్యవేళ, విరజాజి విచ్చుకోవడానికి ఆయత్తమయ్యే వేళ పూర్ణిమ చాలాకాలం తర్వాత ఇంటి గుమ్మం దాటి శివమాల ఇంటివైపు తడబడే అడుగులతో కదిలింది.

వీధి వీధంతా పూర్ణిమని వింతగా చూస్తున్నారు. పూర్ణిమ తలదించుకొని శివమాల ఇంటి తలుపుని వణికే చేతుల్తో తట్టింది.

ఓ క్షణం తర్వాత తలుపు తెరిచిన శివమాల పూర్ణిమని చూసి "లోపలికి రండి" అని మర్యాదగా ఆహ్వానించింది.

పూర్ణిమ లోపలికి వచ్చింది.

"కూర్చోండి" అని శివమాల లోపలికి వెళ్లి మంచినీళ్లు తెచ్చి ఇచ్చింది.

నీళ్లు తాగుతూ పూర్ణిమ ఇంటిని పరిశీలనగా చూసింది. చాలా అందంగా, శుభ్రంగా వుందా ఇల్లు. లోపల గదిలో టేప్ రికార్డర్ లో నుండి శ్రీ శ్రీ గారి గీతం "కలకానిది, విలువైనది" చిన్నగా వినిపిస్తోంది. కొన్ని క్షణాల క్రితం బుద్ధుని ముందు వెలిగించి పెట్టిన గంధం అగరొత్తుల పరిమళం ఆ గదంతా పల్చగా పర్చుకొని ఆహ్లాదాన్ని కలిగిస్తోంది. శివమాల నయనాల్లో వెలిగే కాంతిని చూస్తూ, "మీ...రు... ఇలా... ఎలా... వుం...టున్నారు" అడిగింది పూర్ణిమ.

లలితమైన చిర్నవ్వుని అధరాలపైకి జార్చి "ధైర్యంతో" అంది శివమాల.

పూర్ణిమ వింతగా అర్థం కానట్టు చూసింది.

"పూర్ణిమా! మీరు వివరంగా అడగకపోయినా మీ ప్రశ్న, సందేహాలు ఏంటో నే వూహించగలను. విడాకులు తీసుకున్న నేను ఈ సమాజంలో ఎలా బ్రతుకుతున్నాననే కదూ మీ ప్రశ్న. ఉద్యోగం ఎలా చేస్తున్నాననే కదా మీ సందేహం. నా పెళ్లికి ముందే నా చదువు పూర్తి అయింది. ఉద్యోగం వచ్చింది. ఆ తర్వాతే నా వివాహం అయింది. మా ఇద్దరికీ కుదర్లేదు. నరకంలా వుంటున్నట్టుండేది. డైవోర్స్ తీసుకున్నాను. నా జీవితంలోని దుఃఖాన్ని పోగొట్టుకోవాలని నే డైవోర్స్ తీసుకున్నాను. తీసుకున్నాక కూడా నలుగురూ అనే మాటలకి భయపడి ఏడుస్తూ ఇంట్లోనే కూర్చుని కుమిలిపోతూ నేనెందుకు బ్రతకాలి? స్త్రీ పురుషులు వివాహమనే బంధం వలన ఒకరినొకరు తోడునీడగా జీవితాంతం బ్రతకడంలో ఆనందం వుంది. అలా కుదరక విడిపోయినప్పుడు భర్తతోనే జీవితం ముగిసిపోయినట్టు విలపించి జీవితాన్ని వ్యర్థంగా ఎందుకు గడపాలి? భర్తకోసం నే చదువుకోలేదు. ఉద్యోగం చెయ్యలేదు. ఇప్పుడతను లేడని మానలేను" అంది శివమాల.

"మిమ్మల్ని అందరూ మీరే ముందుగా విడాకులు కోరారని నానామాటలు అంటుంటే ఎలా భరించారు. అసలెలా బయటికి వచ్చారు?" ఆశ్చర్యంగా అడిగింది పూర్ణిమ.

"పూర్ణిమా! నువ్వు డైవోర్స్ కోరలేదు. నీకు ఆ తలంపే లేదు. అయినా మీరిద్దరూ విడిపోవాల్సి వచ్చింది. అయినా అంతా నిన్ను రకరకాల మాటల్తో హింసించారు. అంటే ఇక్కడ మనం గమనించాల్సిన ముఖ్య విషయం - స్త్రీ ప్రమేయం ఏం లేకపోయినా సమాజం ముందుగా స్త్రీనే విమర్శిస్తుంది. కట్నాల కోసం భార్యలని తగలపెట్టే నీచులు,

వ్యర్థ అనుమానాలతో భార్యలని బంధించే గజదొంగల్లాంటి మగవాళ్ళు, వ్యసనాలతో బాధ్యతలని విస్మరించే ఉన్మాదులు, ఎందరో మగవాళ్ళు తలెత్తుకొని దర్జాగా బ్రతికేస్తుంటే ఏ అపరాధం చెయ్యని మనమెందుకు తలదించుకొని బ్రతకాలి? ఎవరైనా ఏమైనా అన్నప్పుడు నా మనసు బాధపడుతుంది. వెంటనే ఈ దౌర్భాగ్య మగవాళ్ళంతా గుర్తు వస్తారు. విలువైన జీవితం గుర్తొస్తుంది. నే ధైర్యవంతురాలైన శివమాలని అయిపోతాను" అందామె చిర్నవ్వుతో.

"వీళ్ళందరి మాటలు భరించే శక్తిలేక ఉద్యోగం మానేసి ఇంట్లోనే ఏడుస్తూ కూర్చున్నాను. మీరు వీళ్ళందర్ని ఎలా మార్చారో తెలుసుకుందామని కుతూహలం ఆపుకోలేక వచ్చాను" అంది పూర్ణిమ.

"నేను వీళ్ళని మార్చటం ఏమిటి?" ఆశ్చర్యంగా అని అంతలోనే నవ్వేస్తూ - "పాత్రబట్టి రూపం సంతరించుకునే నీరు లాంటిది మనిషి మనసు. భయపడేవాడిని భయపెడుతుంది. ఏడిచేవాళ్ళని ఏడిపిస్తుంది. ధైర్యవంతులకి ధైర్యం చెబుతుంది. నువ్వు ఉద్యోగం మాని ఇంట్లో కూర్చుంటే అదే సరియైన నిర్ణయంలా మాట్లాడారు. నే ఎవర్నీ లక్ష్యపెట్టకుండా ఉద్యోగం చేసుకుంటూ, నవ్వుతూ బ్రతుకుతుంటే ఇదే మంచిపద్ధతి అంటున్నారు. ఇటువంటి మనుషులకి భయపడడంలో అర్థం ఏమైనా వుందంటావా?" అంది శివమాల.

పూర్ణిమకి ఆశ్చర్యం వేసింది. ఇంత చిన్న విషయానికి తనెందుకింత కాలం ఏడుస్తూ వ్యర్థంగా గడిపింది. ఎంత అమాయకత్వం! ఎంత మూర్ఖత్వం. 'థేంక్స్ టు శివమాల. ఇప్పటికైనా నా కళ్ళు తెరిపించావ్' అనుకుంటూ శివమాలకి వెళ్ళొస్తానని చెప్పి బయటికి వచ్చి తనింటివైపు తలెత్తి నిటారుగా నడిచింది.

విరజాజి పూర్తిగా విచ్చుకొని సువాసనలు విరజిమ్మటానికి ఆయత్తమవుతూంది. ఆకాశంలో ఉదయిస్తున్న నెలవంకని చూస్తూ 'ఉద్యోగంలో జాయిన్ అవ్వాలి' అనుకుంది పూర్ణిమ.

అమావాస్య తర్వాత ఉదయించిన నెలవంకను జాబిల్లిగా రూపాంతరం సంతరించుకోకుండా నిలిపే శక్తి ఎవ్వరికీ లేదు.

అలాగే పూర్ణిమ జీవితాన్ని ఆనందంగా తీర్చిదిద్దుకోవాలనే తలంపుని ఏ శక్తీ నాశనం చేయలేదు.

• *వనితాజ్యోతి, డిసెంబర్ 1989* •